ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



హోం ఓటింగ్‌కు సర్వం సిద్ధం

- వృద్ధులు, దివ్యాంగులకు ప్రత్యేకం
- సిరిసిల్ల, వేములవాడలో ఏర్పాట్లు
- నేటి నుంచి 5వ తేదీ వరకు
- జిల్లాలో 744 మంది ఓటర్లు

8లో..

ప్రజలకు ఏ కష్టమొచ్చినా అండగా ఉన్నా..

- బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులు ఏ రోజైనా ప్రజా సమస్యలపై పోరాడారా? - ఎంపీ, బీజేపీ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్



బండి సంజయ్‌కుమార్‌ను గజమాలతో సన్మానిస్తున్న నాయకులు

భగత్‌నగర్, మే 2: తెలంగాణ ప్రజలకు ఏ కష్టమొచ్చినా అండగా ఉన్నానని, ప్రజల పక్షాన పోరాటం చేసి జైలు వెళ్లానని ఎంపీ, బీజేపీ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్ అన్నారు. గురువారం రాత్రి నగరంలోని మంచిర్యాల చౌరస్తాలో స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతూ దేశమంతా నరేంద్ర మోదీ గాలి వీస్తుంటే అక్కసుతో రిజర్వేషపై అబద్ధాలు మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకులు ప్రజలను గందరగోళానికి గురి చేస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తే రిజర్వేషన్లపై పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నాడని ఆయన విమర్శించారు. మనమే నంబర్ వన్ అని, బ్యాలెట్‌లో ఒకటో నంబర్ చూసి ఓటేయాలన్నారు. మే 13న జరిగే ఎన్నికలను, ఎండలను లెక్క చేయకుండా ప్రతి ఒక్కరూ కదిలి వచ్చి బ్యాలెట్ పేపర్‌లోని ఒకటో నంబర్ పక్కనున్న పువ్వు గుర్తు బటన్ నొక్కి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యకర్తలకే తెలియని వ్యక్తికి ఓటేసి లాభమేంటన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి ఎన్నికలప్పుడు తప్ప ఎన్నడూ కనిపించడని విమర్శించారు. కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులిద్దరూ రావులు అని, వారికి ఓట్లేస్తే ప్రజలకు ఏమీ రావన్నారు. ముగ్గురు అభ్యర్థులను బేరీజు వేసుకుని మీకోసం పోరాటం చేసే వాళ్లకు ఓటేయాలన్నారు. నాన్ లోకల్ వినోద్‌రావు ఎన్నికప్పుడు తప్ప ఎన్నడు ప్రజలకు కనిపించరన్నారు. రాజేందర్‌రావు ఎవరో కార్యకర్తలకే తెలియదన్నారు. శ్రీరాముడి అక్షింతలను సైతం కించపర్చేస్థాయికి కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు దిగజారారన్నారు. అయోధ్య బాలరాముడి ప్రాణప్రతిష్ఠ విషయాన్ని ప్రజలు మరిచిపోవాలని మోదీపై ఆ పార్టీల నేతలు లేని పోని ఆరోపణలు చేస్తున్నారన్నారు. 140 కోట్ల మందికి కరోనా వాక్సిన్ అందించి ప్రాణాలు కాపాడారన్నారు. 80 కోట్ల మందికి ఉచితంగా బియ్యం అందిస్తున్నారన్నారు. 30 కోట్ల టాయిలెట్స్, 11 కోట్లకు పైగా గ్యాస్ కనెక్షన్లు ఉచితంగా అందించి దేశాన్ని సురక్షితంగా ఉంచినందుకు మోదీని తిడుతున్నారా అని ప్రశ్నించారు. నగరంలోని మంచిర్యాల చౌరస్తా, కోర్టు చౌరస్తా, రాంపూర్ చౌరస్తా, గీతాభవన్ చౌరస్తా, కమాన్ చౌరస్తాల్లో ప్రజల పక్షాన పోరాటం చేశానన్నారు. ఐదు సంవత్సరాల్లో ఏడు సార్లు జైలుకు పోయానన్నారు. కేసీఆర్ హయాంలో ప్రజల పక్షాన కొట్లాడితే 109 కేసులు పెట్టి వేధించి జైలు పంపారన్నారు కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులు మీ కోసం ఎన్నిసార్లు కొట్లాడారన్నారు. ఎన్నికలు కేసులు ఎదుర్కొన్నారన్నారు. ఎన్నిసార్లు జైలుకు పోయారన్నారు. అసలు ఏనాడైనా ఆ ఇద్దరు అభ్యర్థులు ప్రజలను కలిసి కష్టాలు పంచుకున్నారా అని ప్రశ్నించారు. పోలీసులు వస్తేనే ఐదు కిలోమీటర్లు పారిపోయే నేతలు కాంగ్రెస్ నేతలు, జైలు పేరు వింటేనే భయపడి పారిపోయే వారు మీ కోసం ఏం చేస్తారన్నారు. అధికారంలోకి రాగానే వంద రోజుల్లోనే ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని హామీ ఇచ్చి ఓట్లు దండుకున్న కాంగ్రెస్ పార్టీ మహిళలు 2,500 రూపాయలు ఎందుకు ఇవ్వలేదన్నారు. రైతులకు 15 వేలు, విద్యార్థులకు ఐదు లక్షల భరోసా, వృద్ధులకు నాలుగు వేల పింఛన్, వరికి 500 రూపాయల బోనస్ ఇస్తామని మోసం చేశారన్నారు. ప్రజలకోసం ఇవన్ని ఎందుకు అమలు చేయలేదన్నారు. తనను ఓడించేందుకు బీజేపీ, కాంగ్రెస్ కుమ్మక్కు రాజకీయాలు చేస్తున్నాయన్నారు. సమావేశంలో ఇనుగాల పెద్దిరెడ్డి, కార్పొరేటర్లు కొలగాని శ్రీనివాస్, పెద్దపల్లి జితేందర్, గంద్రనళిని, బండ రమణారెడ్డి, కటకం లోకేష్ పాల్గొన్నారు.



మాజీ సర్పంచ్‌లను పార్టీలోకి ఆహ్వానిస్తున్న బండి సంజయ్‌కుమార్



భారీ సంఖ్యలో హాజరైన కార్యకర్తలు, నగర ప్రజలు

బీజేపీలో చేరిన మాజీ సర్పంచ్‌లు

భగత్‌నగర్: చొప్పదండి మండలంలోని బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు చెందిన సర్పంచుల సంఘం అధ్యక్షుడు, మాజీ సర్పంచ్ గుంట రవి ఆధ్వర్యంలో పలువురు మాజీ సర్పంచ్‌లు బీజేపీలో చేరారు. గురువారం రాత్రి నగరంలోని ఎంపీ కార్యాలయంలో వారికి ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీజేపీలో చేరిన వారిలో తోట తిరుపతి, ఏలేటి తిరుపతి రెడ్డి, జి సురేష్, ఎంపిటీసీ గొల్ల సునందగట్టయ్య, సింహాచలం తులసి ఉన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ, వాసాల రమేష్, బీజేపీ మండల అధ్యక్షుడు ఎం సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధి కావాలా.. విధ్వంసం కావాలా..?

- ఆలోచించి ఓటెయ్యండి - బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్



కరీంనగర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న వినోద్‌కుమార్, తదితరులు

కరీంనగర్ టౌన్, మే 2: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో నగర ప్రజలు అభివృద్ధి కావాలో...విధ్వంసం కావాలో ఆలోచించి ఓటెయ్యాలని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ ప్రజలను కోరారు. గురువారం పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా కరీంనగర్‌లోని జ్యోతిబాపూలే, ఆర్ట్స్ కళాశాల మైదానంలో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వినోద్‌కుమార్ మాట్లాడుతూ కేంద్రంలో మోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం ఉన్నా ఎంపీ బండి సంజయ్‌కుమార్ నియోజకవర్గ అభివృద్ధికి ఒక్క రూపాయి ప్రత్యేకంగా తీసుకురాలేదన్నారు. కులం, మతం, ధర్మం అంటూ యువతను రెచ్చగొట్టి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నాడని విమర్శించారు. 2014 నుంచి 19 వరకు తాను ప్రతిపక్ష ఎంపీగా ఉన్నప్పటికి కరీంనగర్ అభివృద్ధి పనులకోసం చాలాసార్లు ప్రధానమంత్రిని, కేంద్రమంత్రులను కలిసి నిధులు తెచ్చానని గుర్తు చేశారు. ప్రజా సమస్యలను పట్టించుకోని సంజయ్‌కి మళ్లీ ఓట్లు అడిగే హక్కులేదన్నారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మాట్లాడుతూ వినోద్‌కుమార్ ఎంపీగా ఉన్నప్పుడు అభివృద్ధికి బాటలు వేశారని అన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు వాల రమణారావు, కంసాల శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

● మత రాజకీయాలతో పబ్బం గడుపుతున్న బీజేపీ

తిమ్మాపూర్: బీజేపీ పదేళ్లలో చేసింది చెప్పలేక దేవుడి పేరు చెప్పి ఓట్లు అడుగుతున్నాడని, ఆ పార్టీ నాయకులు మత రాజకీయాలతో పబ్బం గడుపుతున్నారని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ విమర్శించారు. గురువారం మండలంలోని మన్నెంపల్లి, పోరండ్ల, తిమ్మాపూర్ గ్రామాల్లో ఆయన వినోద్‌కుమార్ ఎన్నికల ప్రచారంలో భాగంగా సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఓటేస్తే కొట్లాడి నిధులు తెచ్చి అభివృద్ధి చేస్తామని, కాంగ్రెస్, బీజేపీకి ఓట్లు వేస్తే విధ్వంసం చేస్తారన్నారు. ప్రజలు కారు గుర్తుపై ఓటు వేసి తనను ఎంపీగా గెలిపించాలని కోరారు. ర్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, మండల అధ్యక్షుడు రావుల రమేష్ పాల్గొన్నారు.



పచ్చునూర్‌లో మాట్లాడుతున్న బోయినపల్లి వినోద్‌కుమార్

● కాంగ్రెస్, బీజేపీ మోసపూరిత మాటలను నమ్మొద్దు

మానకొండూర్: కాంగ్రెస్, బీజేపీ మోసపూరిత మాటలను కరీంనగర్ ప్రజలు నమ్మవద్దని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. మండలంలోని లలితాపూర్, పచ్చునూర్ గ్రామాల్లో గురువారం బీఆర్ఎస్ నాయకులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పని చేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీల పేరుతో అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలను మోసం చేసిందన్నారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీకి ప్రజలు కర్రుకాల్చి వాత పెట్టడడం ఖాయమన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షులు జీవీ రామకృష్ణారావు, జడ్పీటీసీ తాల్లపల్లి శేఖర్‌గౌడ్ పాల్గొన్నారు.



సిరిసిల్లలో ప్రచారం చేస్తున్న బోయినపల్లి మాధవి

కార్మికవాడల్లో బీఆర్ఎస్ అభ్యర్థి సతీమణి మాధవి ప్రచారం

సిరిసిల్ల టౌన్: కరీంనగర్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ సతీమణి బోయినపల్లి మాధవి సిరిసిల్ల పట్టణంలోని కార్మికవాడల్లో గురువారం విస్తృతంగా ప్రచారం చేశారు. స్థానిక బీవైనగర్‌లోని కట్ట మైసమ్మవారిని దర్శించుకొని ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం మున్సిపల్ పరిధిలోని 31, 32, 33, 34, 35 వార్డుల్లో గడప గడపకు తిరుగుతూ బీఆర్ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రచారం చేశారు. ప్రచారంలో బాగంగా మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి, బోయినపల్లి మాధవి కార్మికవాడలోని ఓ హోటల్‌లో చపాతీలు చేస్తూ ఓటర్లను ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వినోద్‌కుమార్‌ను గెలిపించుకుంటే తెలంగాణ గళాన్ని ఢిల్లీలో వినిపించవచ్చొన్నారు. కాంగ్రెస్, బీజేపీ నాయకులకు తెలంగాణపై ప్రేమలేదన్నారు. కారు గుర్తుకు ఓటు వేసి వినోద్‌కుమార్‌ను గెలిపించాలని కోరారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ మంచె శ్రీనివాస్, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమా, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు వెంగల శ్రీనివాస్, మహిళా అధ్యక్షురాలు బత్తుల వనజ, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ గుడ్ల మంజుల, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

వంద శాతం ఉత్తీర్ణత హర్షణీయం: డీఈవో

సిరిసిల్ల రూరల్, మే 2: పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించడానికి కృషి చేసిన ఉపాధ్యాయుల సేవలు హర్షణీయమని డీఈవో రమేష్‌కుమార్ అన్నారు. సిరిసిల్ల పట్టణం శివనగర్ కుసుమ రామయ్య బాలుర ఉన్నత పాఠశాలలో పదోతరగతిలో అత్యున్నత ప్రతిభ చూపిన విద్యార్థులను గురువారం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో 110 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 110 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు పాతూరి మహేందర్‌రెడ్డి, నసీరోద్దీన్, నారాయణ, సత్యకుమారి, అజయ్, వెంకటేశం, రామకృష్ణ, వంశీ పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న డీఈవో రమేష్‌కుమార్

● పదో తరగతి ఫలితాల్లో జిల్లా మూడో స్థానంలో రావడానికి కృషి చేసిన డీఈవో రమేష్‌కుమార్‌ను గురువారం ఉపాధ్యాయ సంఘాల నాయకులు సన్మానించారు. ఎసీజీ వెంకటేశ్వర్‌రావు, జిల్లా పీజీ హెచ్‌ఎం అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి లకావత్ మోతీలాల్, టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శంకర్‌గౌడ్, బీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కుమ్మరి మల్లేశం, పెటా జిల్లా అధ్యక్షుడు దేవతా ప్రభాకర్, టీపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లారపు పురుషోత్తం నీరజ, వెంకటస్వామి పాల్గొన్నారు.

రాజన్నను దర్శించుకున్న మాధవానందస్వామి

వేములవాడ, మే 2: వేములవాడ రాజరాజేశ్వరస్వామిని తొగుట పీఠాధిపతి మాధవానందస్వామి గురువారం దర్శించుకున్నారు. స్వామీజీకి ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం స్వామీజీ రాజరాజేశ్వర స్వామిని దర్శించుకుని అభిషేక పూజలో పాల్గొన్నారు. స్వామి వారి కల్యాణ మండపంలో ఆలయ ఈవో కృష్ణప్రసాద్, స్థానాచార్యులు అప్పాల బీమాశంకర్, అర్చకులు స్వామీజీకి పండ్లు అందజేశారు. ఆలయ ఏఈవో శ్రీనివాస్, ప్రోటోకాల్ పర్యవేక్షకులు సిరిగిరి శ్రీరాములు, ఆలయ పర్యవేక్షకులు తిరుపతిరావు, ఇన్‌స్పెక్టర్ చెక్కిళ్లఅశోక్, ఈవో సీసీ ఎడ్ల శివసాయి, పాల్గొన్నారు.



పండ్లు, ప్రసాదం అందజేస్తున్న ఆలయ ఈవో

జనజాతర సభకు ఏర్పాట్లు పూర్తి

- నేడు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాక



బహిరంగ సభ వద్ద ఏర్పాటు చేసిన షెడ్

సిరిసిల్ల, మే 2 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల్లో కరీంనగర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ సత్తా చాటాలని భావిస్తోంది. ఇందులో భాగంగా శుక్రవారం జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న జనజాతర సభకు ఏర్పాట్లు పూర్తి చేశారు. సిరిసిల్ల, వేములవాడ రెండు సెగ్మెంట్ల నుంచి భారీ జనసమీకరణ చేపట్టేందుకు ప్రణాళిక రూపొందించారు. మరోవైపు జిల్లాలో ఎండ తీవ్రత ఎక్కువగా ఉంది. ఈ పరిస్థితి శుక్రవారం కూడా కొనసాగితే సభకు జనం రావడానికి ఇబ్బందులు పడే పరిస్థితులు ఉన్నాయని ఆందోళన చెందుతున్నారు. సభకు వచ్చే ప్రజల కోసం ప్రత్యేక షెడ్, కూలర్లు, మంచినీటి సౌకర్యం కల్పించారు. ఏర్పాట్లను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, సిరిసిల్ల ఇన్‌చార్జ్ కేకే మహేందర్‌రెడ్డితో పాటు ఇతర ముఖ్య నాయకులు పర్యవేక్షించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత తొలిసారిగా ఏర్పాటు చేస్తున్న ఎన్నికల సభను విజయవంతం చేసేందుకు కాంగ్రెస్ నాయకులు సిద్ధమయ్యారు. పట్టణంలో భారీ హోర్డింగులు, కాంగ్రెస్ జెండాలతో అలంకరించారు.

● భద్రత ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ..

సిరిసిల్ల క్రైం: సీఎం రేవంత్‌రెడ్డి జిల్లా పర్యటన సందర్భంగా గురువారం సాయంత్రం ఎస్పీ అఖిల్ మహాజన్ బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. అధికారులకు సూచనలు చేశారు. భద్రతా చర్యల్లో లోపాలు లేకుండా చూడాలన్నారు. ట్రైనీ ఐపీఎస్ రాహుల్‌రెడ్డి, అదనపు ఎస్పీ చంద్రయ్య, డీఎస్పీలు చంద్రశేఖర్ రెడ్డి, మురళీకృష్ణ, సీఐలు రఘుపతి, అనిల్‌కుమార్, శ్రీనివాస్, ఎస్సైలు ఉన్నారు.

సప్లిమెంటరీ ర్యాండమైజేషన్ పూర్తి

సిరిసిల్ల కలెక్టరేట్, మే 2: లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి జిల్లాకు అదనంగా కేటాయించిన బ్యాలెట్ యూనిట్ల సప్లిమెంటరీ ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తయినట్లు కలెక్టర్ అనురాగ్ జయంతి తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో వీడియోకాన్ఫరెన్స్ హాల్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో అదనపు బ్యాలెట్ యూనిట్ల సప్లిమెంటరీ ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించారు. వేములవాడ, సిరిసిల్ల అసెంబ్లీ సెగ్మెంట్‌లకు కేటాయించిన బ్యాలెట్ యూనిట్ల జాబితాను రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందజేశారు. కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని కోరారు. అదనపు కలెక్టర్ ఎస్.ఖీమ్యా నాయక్, కలెక్టరేట్ పర్యవేక్షకులు శ్రీకాంత్ పాల్గొన్నారు.



భూకబ్జా కేసుల్లో నిందితులకు పోలీస్ కస్టడీ




నిందితులను కస్టడీకి తీసుకుంటున్న సీఐ ప్రదీప్‌కుమార్

కరీంనగర్‌క్రైం, మే2: నకిలీ ధ్రువపత్రాలు సృష్టించి, ఇంటి స్థలాన్ని కాజేసేందుకు యత్నించిన, విక్రయదారులను బెదిరింపులకు గురిచేసి డబ్బు దోపిడీకి పాల్పడిన కేసులో నలుగురు, నకిలీ పత్రాలతో ఇంటిని కూల్చిన కేసులో ఐదుగురు మొత్తం 9 మంది నిందితులను గురువారం కస్టడీకి తీసుకున్నామని కరీంనగర్ రూరల్ సీఐ ఏ ప్రదీప్‌కుమార్ తెలిపారు. కరీంనగర్ బ్యాంకు కాలనీకి చెందిన దొమ్మటి యుగందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు 18వ డివిజన్ కార్పొరేటర్ సుదగోని మాధవితో పాటు ఆమె భర్త కృష్ణ గౌడ్, కొత్త జైపాల్‌రెడ్డి, మున్సిపల్ ఆర్ఐ జంకే శ్రీకాంత్, మున్సిపల్ బిల్ కలెక్టర్ కొత్తపల్లి రాజుతో సహా మొత్తం 12 మందిపై కొత్తపల్లి పోలీసుఠాణాలో కేసు నమోదు కాగా, అందులో నలుగురు నిందితులు మొహమ్మద్ ఫిరోజ్‌ఖాన్, కాంపెల్లి రామాంజనేయులు, జంకే శ్రీకాంత్, కొత్తపల్లి రాజులను ఇటీవల అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన విషయం తెలిసిందే. ఈ కేసుకు సంబంధించిన మరింత కీలక సమాచారం సేకరించేందుకు జైలులో ఉన్న నలుగురు నిందితులని కోర్టు అనుమతి ద్వారా గురువారం ఉదయం 10:30 గంటల నుంచి శుక్రవారం ఉదయం 10:30 గంటల వరకు కొత్తపల్లి పోలీసులు కస్టడీకి తీసుకున్నారు. కస్టడీకి తీసుకున్న నలుగురు నిందితులను విచారించటంతో పాటు వారి ఇళ్లల్లో సోదాలు నిర్వహించి పలు కీలక డాక్యుమెంట్లను స్వాధీన పరుచుకున్నామని సీఐ ప్రదీప్ కుమార్ తెలిపారు.

● బుల్డోజర్ గ్యాంగ్ అరెస్టు కేసులో కరీంనగర్ జైలులో ఉన్న నిందితులు బారాజు రత్నాకర్‌రెడ్డి, చందా శంకర్‌రావు, బకిట్ సాయి, పిట్టల మధు, షాహిద్‌ఖాన్‌లను కొత్తపల్లి పోలీసులు కస్టడీకి తీసుకున్నారు. ఈ కేసులో మరింత లోతుగా విచారించేందుకు అనుమతి కోరుతూ కోర్టు ద్వారా గురువారం ఉదయం 10:30 గంటల నుంచి శుక్రవారం ఉదయం 10:30 గంటల వరకు కస్టడీకి తీసుకున్నారు. కస్టడీకి తీసుకున్న ఐదుగురు నిందితులను విచారించటంతో పాటు వారి ఇళ్లల్లో సోదాలు నిర్వహించి పలు కీలక డాక్యుమెంట్లను స్వాధీన పరుచుకున్నామని సీఐ ప్రదీప్ కుమార్ తెలిపారు.

ఊటూర్ సింగిల్‌విండో అధ్యక్ష, కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు

మానకొండూర్, మే 2 : మండలంలోని ఊటూర్ సహకార సంఘం అధ్యక్షులు ముద్దసాని ప్రదీప్‌రెడ్డి కార్యదర్శి మిట్టపల్లి రవీందర్‌లకు గురువారం జిల్లా సహకార అధికారి రామానుజాచార్యులు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. గత నెల 16న సహకార సంఘంలో జరిగిన విచారణ నివేధికను విచారణ అధికారి రాజు డిసీవోకు అందజేశారు. దీంతో సహకార సంఘంలో కార్యదర్శి రవీందర్ తీసుకున్న వ్యక్తిగత రుణం రూ. 3.53లక్షలు, సంఘంలో రూ. 24లక్షల ఓవర్‌డ్యూ బినామీలకు అప్పుగా ఇచ్చారని అధ్యక్ష కార్యదర్శులు ఆ రుణాన్ని వసూలు చేయాలని జారీ చేసిన షోకాజ్ నోటీసులో పేర్కొన్నారు. పదిరోజుల్లోగా ఎంసీ సమావేశం ఏర్పాటు చేసి చర్యలు తీసుకోవాలని ఆయన నోటీస్‌లో పేర్కొన్నారు.

ఇద్దరు దొంగల అరెస్టు

● రూ. 67,700, 8 తులాల వెండి స్వాధీనం



దొంగలను అరెస్టు చూపిస్తున్న డీఎస్పీ

జగిత్యాల టౌన్, మే 2 :తాళం వేసి ఉన్న ఇళ్లను టార్గెట్ చేసి దొంగతనానికి పాల్పడుతున్న ఇద్దరు దొంగలను గురువారం జగిత్యాల పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద రూ. రూ. 67,700 వేల నగదు, 8 తులాల వెండి స్వాధీనం చేసుకున్నారు. టౌన్ పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ రఘుచందర్ విలేకరుల సమావేశం నిర్వహించి ఇద్దరు దొంగలను అరెస్టు చూపించి వివరాలు వెల్లడించారు. కోరుట్ల పట్టణంలోని అల్లమయ్య గుట్ట చెందిన విబూది శేఖర్ గత ఐదు సంవత్సరాలుగా జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఉంటూ ఆలయాలతో పాటు ఇళ్లలో దొంగతనాలు చేసి జల్సాలకు అలవాటు పడ్డాడు. 10 దొంగతనాల కేసుల్లో జైలు శిక్ష అనుభవిస్తున్న సమయంలో శేఖర్‌కు బుగ్గారం మండలం బీర్‌సాని గ్రామానికి చెందిన గుమ్మాల వెంకటేష్‌తో పరిచయం ఏర్పడింది. ఇద్దరు జైలు నుంచి బయటకు వచ్చిన అనంతరం జిల్లా కేంద్రంలో ఏడు ఇళ్లలో చొరబడి రూ.1.11 లక్షల నగదు, 8తులాల వెండిని నగలను దోచుకున్నారు.

పోలీసులు గురువారం కరీంనగర్ రోడ్‌లో వాహనాలు తనిఖీ చేస్తున్న సమయంలో ఇద్దరు వ్యక్తులు పారిపోతుండగా పట్టుబడ్డారు. విచారణలో దొంగలుగా గుర్తించి వారి వద్ద రూ. 67,700 వేల నగదు, 8 తులాల వెండి స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ వివరించారు. ఈ సమావేశంలో సీఐ వేణుగోపాల్, ఎస్సైలు మన్మథ రావు, నరేష్ తదితరులు ఉన్నారు.

రూ.7,400 పలికిన పత్తి ధర

జమ్మికుంట, ఏప్రిల్ 2: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7,400 పలికింది. మంగళవారం ఇరువై మంది రైతులు 324క్వింటాళ్ల విడి పత్తి, ఐదుగురు రైతులు ఆరు క్వింటాళ్ల గోనె సంచుల్లో విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర రూ.7400, కనిష్ఠ ధర రూ.5200 చెల్లించి కొనుగోళ్లు చేపట్టారు.

భూ కబ్జాకు యత్నించిన వ్యక్తి అరెస్టు

చొప్పదండి, మే 2: తప్పుడు డాక్యుమెంట్లతో భూమిని కబ్జా చేయడానికి ప్రయత్నించిన వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్‌ఐ ఉపేంద్రాచారి కథనం మేరకు రుక్మాపూర్‌కు చెందిన 15ఏ సర్వే నెంబర్‌లో 35 గుంటల భూమిని రుక్మాపూర్‌కు చెందిన ముద్దసాని రంగయ్య, వంగ సురేష్, చొప్పదండికి చెందిన గుర్రం రాజేందర్ రెడ్డి, గుర్రం ఇంద్రసేన రెడ్డిలు 2017లో కొనుగోలు చేశారు. ఈ భూమి తనదేనని ముద్దసాని రాజయ్య కోర్టులో కేసు వేయగా అనంతరం లోక్ అదాలత్‌లో నలుగురు రాజీ పడ్డారు. కాగా ఈ భూమిని కాజేయాలనే ఉద్దేశ్యంతో గ్రామానికి చెందిన ముద్దసాని కొమురయ్య, లంక శేఖర్‌లు ముద్దసాని రాజయ్య వద్ద 2013లో రూ.34 లక్షలకు కొనుగోలు చేసినట్లు సాదా బైనామా కాగితాన్ని సృష్టించి భూమిని వివాదం చేశారు. నలుగురు పట్టాదారులను మోకాపై భయభ్రాంతులకు గురి చేశారని ముద్దసాని రంగయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముద్దసాని కొమురయ్య, లంక శేఖర్‌లపై చీటింగ్, ఫోర్జరీ ఫాల్సిఫికేషన్ సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. ముద్దసాని కొమురయ్యను అరెస్టు చేసి రిమాండుకు పంపించగా, లంక శేఖర్ కరీంనగర్ రూరల్‌లో నమోదైన కేసుకు సంబంధించి జైలులో ఉన్నట్లుతెలిపారు.

అక్కాచెల్లెళ్లను అప్పగించిన పోలీసులు

మల్యాల, మే 2: అదృశ్యమైన అక్కాచెల్లెళ్లను పోలీసులు తండ్రికి అప్పగించారు. మండలంలోని ఓబులాపూర్‌కు చెందిన అక్కాచెల్లెల్లు వైష్ణవి(17), ప్రసన్న(15)లు మంగళవారం రాత్రి మేడపైన పడుకోగా బాత్రూంకు అని కిందకు దిగి ఇంటి నుంచి వెళ్లిపోయారు. తిరిగి రాక పోవడంతో తండ్రి బాబు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు బాలికల తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ఎస్సై అబ్దుల్ రహీం, పోలీసులు పలు చోట్ల గాలింపు చేపట్టారు. అయితే ఆధార్‌కార్డులు వెంట బెట్టుకొని బయలుదేరిన అక్కాచెల్లెల్లు ఆర్టీసీ బస్సులో సికింద్రాబాద్‌కు వెళ్లి అక్కడ నుంచి బుధవారం రాత్రి జగిత్యాల బస్టాండ్‌కు తిరిగివచ్చారు. వారిని గమనించిన కొందరు మల్యాల పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఎస్సై అబ్దుల్ రహీం, పోలీసులు అక్కడకు చేరుకొని వారిని పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చారు. విచారించి తండ్రికి అప్పగించారు.

ద్విచక్ర వాహనం చోరీ

మల్యాల, మే 2: దిగువ కొండగట్టులో ద్విచక్ర వాహనం చోరీకి గురి అయింది. పంజాల మల్లేశంగౌడ్‌కు చెందిన ద్విచక్రవాహనంను బుధవారం రాత్రి ఇంటి ముందు పార్క్ చేసి పెట్టగా గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. దాంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా దర్యాప్తు జరుపుతున్నారు.

రాజన్నను దర్శించుకున్న మాధవానందస్వామి


మాధవానంద స్వామికి పండ్లు ప్రసాదం అందజేస్తున్న ఆలయ ఈవో, అర్చకులు

వేములవాడ, మే 2: వేములవాడ రాజరాజేశ్వరస్వామిని తొగుట పీఠాధిపతి మాధవానందస్వామి గురువారం దర్శించుకున్నారు. స్వామీజీకి ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం స్వామీజీ రాజరాజేశ్వర స్వామిని దర్శించుకుని అభిషేక పూజలో పాల్గొన్నారు. అనంతరం స్వామివారి కల్యాణ మండపంలో ఆలయ ఈవో కృష్ణ ప్రసాద్, స్థానాచార్యులు అప్పాల బీమా శంకర్, అర్చకులు స్వామీజీకి పండ్లు అందజేశారు. అనంతరం స్వామీజీ ఆశీర్వచనం గావించారు. ఆలయ ఏఈవో శ్రీనివాస్, ప్రోటోకాల్ పర్యవేక్షకులు సిరిగిరి శ్రీరాములు, ఆలయ పర్యవేక్షకులు తిరుపతి రావు, ఇన్‌స్పెక్టర్ చెక్కిళ్ల అశోక్, ఈవో సీసీ ఎడ్ల శివసాయి, అర్చకులు, వేదపండితులు పాల్గొన్నారు.


డ్రంకెన్ డ్రైవ్ కేసులో ముగ్గురికి జైలు

కరీంనగర్ క్రైం, మే 2 : కరీంనగర్ పట్టణంలో ఇటీవల మద్యం సేవించి వాహనాలు నడిపి పట్టుబడిన 16 మంది వ్యక్తులను కరీంనగర్ ట్రాఫిక్ పోలీసులు గురువారం కరీంనగర్ మున్సిఫ్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పరచగా జడ్జి ఇందులో నుంచి ఒక వ్యక్తికి ఏడు రోజుల జైలు శిక్ష మరొక వ్యక్తికి ఐదు రోజుల జైలు శిక్ష, ఇంకొక వ్యక్తికి మూడు రోజుల జైలు శిక్ష, మొత్తం రూ. 4,500 జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు. మిగతా 13 మంది వ్యక్తులకు 18 వేల రూపాయల జరిమానా విధించారని తెలిపారు.

రాజీ మార్గంలో 43 సంవత్సరాల ఆస్తి వివాదం పరిష్కారం

జగిత్యాల టౌన్, మే 2 :జగిత్యాల కోర్టులో 43 సంవత్సరాలుగా కొనసాగుతున్న వారసత్వ ఆస్తి వివాదం గురువారం రాజీమార్గం ద్వారా పరిష్కారం అయింది. వివరాల్లోకి వెళితే.. పట్టణంలోని బ్రాహ్మణవాడకు చెందిన రుద్రంగి నర్సయ్య, రుద్రంగి రాజన్న, విశ్వనాథం అనే ముగ్గురు సోదరుల మధ్య తన తండ్రి స్థిర, చర ఆస్తుల పంపిణీ విషయంలో వివాదం ఏర్పడింది. 1981లో ఈ వివాదం జగిత్యాల కోర్టు ఏర్పడగానే మొదలైంది. వీరికి జగిత్యాల బ్రాహ్మణవాడతో పాటు జగిత్యాల అర్బన్ మండలం మోతె, తిప్పన్నపేటలో స్థిర, చర ఆస్తులు ఉన్నాయి. కోర్టులో కేసు కొనసాగుతుండగానే రాజన్న, విశ్వనాథంలు అనారోగ్యంతో మృతి చెందారు. అయితే నర్సయ్య తన సోదరుల వారసులతో రాజీ కుదుర్చుకోగా న్యాయవాదులు మహేందర్, సుబ్రహ్మణ్యం, మురళీధర్ రావులు తమ వాదనలను సివిల్ జడ్జి ప్రసాద్ సమక్షంలో రాజీ కుదిర్చారు. దీంతో 43 సంవత్సరాలుగా వారసత్వ ఆస్తి వివాదం ముగిసింది.

జగిత్యాలలో రేషన్ బియ్యం పట్టివేత


ఆటోలో తరలిస్తున్న బియ్యం సంచులు

జగిత్యాల టౌన్, మే 2 : జగిత్యాల జిల్లా కేంద్రంలో రేషన్ బియ్యం అక్రమ దందా కొనసాగుతూనే ఉంది. జిల్లా కేంద్రంలోని బీట్ బజార్ ప్రాంతం నుంచి రేషన్ బియ్యాన్ని కొంతమంది ఆటోలో అక్రమంగా తరలిస్తుండగా వాహనానికి పంక్చర్ అయ్యింది. దీంతో వారు అక్రమ రేషన్ బియ్యాన్ని ఒక ఆటో నుంచి మరో ఆటోలో తరలించే క్రమంలో స్థానికుల సమాచారంతో పట్టణ పోలీసులు పట్టుకున్నారు. సుమారు 8 క్వింటాళ్ల రేషన్ బియ్యంతో పాటు రెండు ఆటోలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

కోనరావుపేట, మే 2:సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై అంజనేయులు అన్నారు. కోనరావుపేట మండలం ధర్మారంలో గురువారం నేరాల నియంత్రణపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. సైబర్ నేరానికి గురైతే వెంటనే 100 డయల్ చేయాలన్నారు. గ్రామాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు.ఏఎస్సై శ్రీనివాస్ రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

కోటి 51 లక్షలకు పైగా నగదు జప్తు

● కోటి 48 లక్షలకు పైగా విడుదల ● పెద్దపల్లి పార్లమెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ముజమ్మిల్‌ఖాన్

పెద్దపల్లి, మే 2(ఆంధ్రజ్యోతి) : పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో నిర్వహించిన తనిఖీలలో ఇప్పటివరకు కోటి 51లక్షల 38వేల 82 రూపాయలను జప్తు చేసి, సరైన ఆధారాలు పరిశీలించి గ్రీవెన్స్ కమిటీ కోటి 48 లక్షల 58 వేల 702 రూపాయలను విడుదల చేసినట్లు పెద్దపల్లి పార్లమెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ముజమ్మిల్‌ఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. మంథని అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో 6లక్షల 81 వేల 830 రూపాయలు, పెద్దపల్లి అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో 17 లక్షల 5 వేల 500, చెన్నూరు అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో 8 లక్షల 59 వేల 200 రూపాయలు, బెల్లంపల్లి అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో 49 లక్షల 41 వేల 922, మంచిర్యాల అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో 15లక్షల 76 వేల 330 రూపాయలు సీజ్ చేయగా, ఆధారాలను పరిశీలించిన గ్రీవెన్స్ కమిటీ పూర్తిస్థాయిలో నగదును విడుదల చేసిందన్నారు. రామగుండం



అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో 22 లక్షల 90 వేల 90 రూపాయలు సీజ్ చేయగా, ఆధారాలను పరిశీలించి 20 లక్షల 61 వేల 710 రూపాయలను, ధర్మపురి అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో 30 లక్షల 83 వేల 210 రూపాయలు నగదు సీజ్ చేయగా, ఆధారాలను పరిశీలించి 30లక్షల 32 వేల 210 రూపాయలను విడుదల చేశామన్నారు. సరైన ఆధారాలు సమర్పించని కారణంగా 2లక్షల 79వేల 380 రూపాయలు విడుదల చేయలేదన్నారు. ఎన్నికల నేపథ్యంలో నిర్వహించిన తనిఖీలలో జప్తుచేసిన సొమ్ము, అభరణాలపై ప్రతిరోజు కలెక్టరేట్‌లోని జిల్లా సహకార అధికారి కార్యాలయంలో గ్రీవెన్స్ కమిటీ ప్రతిరోజు సమావేశం నిర్వహించి, ఆధారాలను పరిశీలించి జప్తు చేసిన నగదు, ఆభరణాలను విడుదల చేస్తుందని, తనిఖీల సమయంలో నగదు, ఆభరణాలు జప్తునకు గురైతే ఆందోళన చెందకుండా వాటికి సంబంధించిన ఆధా రాలను జిల్లా గ్రీవెన్స్ కమిటీకి సమర్పిస్తే వెంటనే విడుదల చేస్తుందని ప్రకటనలో తెలిపారు.

కోర్టుకు హాజరు కాకుండా తిరుగుతున్న వ్యక్తి రిమాండ్

మెట్‌పల్లి, మే, 2 : కోర్టు కేసుకు కొన్ని రోజుల నుంచి హాజరు కాకుండా తిరుగుతున్న బోందు గణేష్‌సింగ్‌ను రిమాండ్‌కు తరలించినట్ల ఎస్సై చిరంజీవి గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణానికి చెందిన బోందు గణేష్‌సింగ్‌పై కేసు నమోదు కావడంతో కోర్టులో హాజరు కావాల్సి ఉంది. కానీ కోర్టుకు హాజరు కాకుండా తిరుగుతున్న గణేష్‌పై నాన్‌బెయిలబుల్ అరెస్ట్ వారెంట్ ఉంది. దీంతో ఆయనను పట్టుకుని కోర్టులో హాజరు పరచి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

● లోకసభ ఎన్నికల నిబంధనలు ప్రతి ఒక్కరూ తప్పకుండా పాటించాలని మెట్‌పల్లి సీఐ నవీన్‌కుమార్ అన్నారు. గురువారం పట్టణంలోని ఆర్టీసీ బస్ డిపో సమీపంలో ఎస్సై చిరంజీవి సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీలను చేపట్టారు. తనిఖీల్లో ఎలాంటి అధారాలు లేకుండా దిచక్ర వాహనంపై రూ. 1,70వేల నగదును తరలిస్తున్న వ్యక్తిని పట్టుకున్నారు. పట్టుకున్న వ్యక్తి నుంచి నగదును స్వాధీనం చేసుకుని సంబంధిత అధికారులకు అప్పగించారు. ఎన్నికల నిబంధనల ప్రకారం రూ. 50వేలకు మించి ఉంటే వాటికి సంబంధించిన పత్రాలను తమ వెంట ఉంచుకోవాలని సూచించారు.

తానా రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా డాక్టర్ ఎలగందుల శ్రీనివాస్



సుభాష్‌నగర్, మే 2: తెలంగాణ హాస్పిటల్స్ అండ్ నర్సింగ్ హోమ్స్ అసోసియేషన్(తానా) రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా జిల్లా కేంద్రంలోని వాసుదేవ హాస్పిటల్ అధినేత డాక్టర్ ఎలగందుల శ్రీనివాస్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త జిల్లాల్లో తానా శాఖల ఏర్పాటుకు కృషి చేస్తానని అన్నారు.

మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో రామానుజమ్మకు కాంస్యం

సిరిసిల్ల టౌన్, మే 2: జాతీయ స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ పరుగు పందెంలో రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రానికి చెందిన టమటం రామానుజమ్మ కాంస్య పతకం కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా గురువారం సిరిసిల్లలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రామానుజమ్మను మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ సభ్యులు అభినందించారు. ఏప్రిల్ 26 నుంచి 28 వరకు ముంబాయి విద్యావిహార్ (ఈస్ట్)లోని సోమయ్య అథ్లెటిక్స్ ట్రాక్‌పై 43వ జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ - 2024 పోటీలు నిర్వహించారు. పోటీలకు తెలంగాణ రాష్ట్రం నుంచి రామానుజమ్మ హాజరయ్యారు. మహిళల 70ప్లస్ విభాగంలో 800 మీటర్ల పరుగు పందెంలో రామానుజమ్మ మూడో స్థానంలో నిలిచింది. ఇండియా మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కేబీ నాగూర్, ప్రధాన కార్యదర్శి వికాస్‌చౌవన్ కాంస్య పతకంతో పాటు సర్టిఫికెట్‌ను అందజేశారు.



కాంస్య పతకంతో రామానుజమ్మ

విద్యుత్ వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలి

గణేశ్‌నగర్, మే 2: విద్యుత్ వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఈ వడ్లకొండ గంగాధర్ సూచించారు. విద్యుత్ భద్రతా వారోత్సవాల పోస్టర్లు, కరపత్రాలను ఎన్‌పీడీసీఎల్ కరీంనగర్ సర్కిల్ కార్యాలయంలో ఆయన ఆవిష్కరించారు. ప్రతి డివిజన్, సబ్ డివిజన్‌లో విద్యుత్ వినియోగదారులకు విద్యుత్ భద్రత ప్రాముఖ్యతను వివరించాలన్నారు. విద్యుత్ ప్రమాదాలను నివారించడానికి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలియజేయాలని అన్నారు. మే1 నుంచి 7వరకు వారం రోజులు విద్యుత్ భద్రత సమావేశాలు నిర్వహించి అందరికీ కరపత్రాలు పంపిణీ చేయాలని సూచించారు. రైతులు తమ వ్యవసాయ అవసరాల నిమిత్తం, వ్యవసాయ పంపు సెట్లను వినియోగించినప్పుడు కరెంటు మోటార్లు, ఫుట్ వాల్వులు, సర్వీసు వైర్లకు ఇన్సులేషన్ సరిగ్గా లేకపోవడం వలన విద్యుత్ ప్రసారం జరిగి ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. వ్యవసాయ పంపుసెట్లను స్టార్టర్లను విధిగా ఎర్త్ చేయించాలన్నారు. విద్యుత్ ప్రమాదాలు ఎక్కువగా ఎర్త్ చేయబడని పరికరాల వల్లే జరుగుతాయన్నారు. డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద అనధికారంగా ఫ్యూజులు మార్చడం, రిపేరు చేయడం, కాలిన తీగలను సరిచేయడం ప్రమాదకరమన్నారు. గృహాలలో అతుకులు లేని సర్వీసు వైరును మాత్రమే ఉపయోగించాలని ఎస్‌ఈ సూచించారు. చేపలు పట్టడానికి విద్యుత్ తీగలు వాడరాదన్నారు. కొన్ని చోట్ల జంతువుల నుంచి పంట రక్షణ కొరకు విద్యుత్ ఫెన్సింగ్


విద్యుత్ భద్రతా వారోత్సవాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎస్‌ఈ గంగాధర్

వేస్తున్నారని ఇది చట్టరీత్యా నేరమన్నారు. విద్యుత్ సంబంధిత సమస్యలకు ఫిర్యాదులు తెలియజేయడానికి టోల్ ఫ్రీ నెంబరు 18004250028కు లేదా 1912కు ఫోన్ ద్వారా తెలపాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఎస్‌ఈ వడ్లకొండ గంగాధర్, విజయేందర్ రెడ్డి, రాజం, తిరుపతి, రాజేశం ,లావణ్య, ఆ.చంద్రయ్య, హబీబా, సురేష్ కుమార్, శ్రీహరి, మునీందర్, చంద్రశేఖర్, పండరి, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

కోరుట్ల, మే 2: పట్టణంలోని ఆదర్శనగర్‌లో తాళం వేసి ఉన్న ఇంట్లో బుధవారం రాత్రి చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కాలనీకి చెందిన కస్తూరి పద్మ కుమారుడు క్రాంతికుమార్ ఉపాధి నిమిత్తం గల్ఫ్ వెళ్లాడు. పద్మ తన కోడలితో నివాసం ఉంటోంది. బుధవారం పద్మ తన కోడలుతో మెట్‌పల్లి పట్టణంలో బంధువుల ఇంటికి ఇంటికి తాళం వేసి శుభకార్యానికి వెళ్లింది. గురువారం ఉదయం ఇంటి తాళం పగుల గొట్టి ఉండటంతో గమనించిన కాలనీవాసులు విషయాన్ని పద్మకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. దీంతో పద్మ ఇంటికి చేరుకుని చూడగా ఇంటి తాళం పగులగొట్టి ఉంది. ఇంట్లోని సామగ్రి చిందరవందరగా పడి ఉండి బీరువా తెరిచి ఉండడంతో స్థానికుల సహకారంతో పోలీసులకు సమాచారం అందించారు. దీంతో సంఘటన స్థలానికి చేరుకున్న ఎస్‌ఐ కిరణ్ కుమార్ విచారణ చేపట్టారు. బీరువాలో ఉన్న 5 తులాల బంగారు ఆభరణాలతో పాటు ఇంటి ఆవరణలో ఉన్న ద్విచక్రవాహనం చోరీకి గురైనట్లు పద్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేసి విచారణ చేపట్టారు.

పొలాల్లో అగ్ని ప్రమాదం.. విద్యుత్ పరికరాలు దగ్ధం

ఎల్లారెడ్డిపేట, మే 2: ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లి గ్రామ శివారులోని ఎల్లమ్మ ఆలయం ప్రాంతంలో గురువారం వ్యవసాయ పొలాల్లో అగ్ని ప్రమాదం సంభవించింది. గ్రామంలోని రైతులకు చెందిన సుమారు 100 ఎకరాల విస్తీర్ణంలో వరి పంటను కోసి గడ్డిని పొలాల్లో ఉంచారు. ఒక్కసారిగా పొలాల్లో మంటలు వ్యాపించాయి. రైతులు దేవయ్య, నాగరాజు, అంజయ్యలతో పాటు మరో సుమారు పది మంది రైతులకు చెందిన సాగునీటి పైపులు, విద్యుత్ స్టార్టర్లు, కరెంటు తీగలు కాలిపోయాయి. చుట్టుపక్క రైతులు చేరుకొని సుమారు రెండు గంటల పాటు శ్రమించి మంటలను ఆర్పివేశారు. రూ.60 వేల ఆస్తి నష్టం వాటిల్లిందని బాధిత రైతులు పేర్కొన్నారు. వరి పంటను కోసి గడ్డికి నిప్పుపెట్టడం వల్ల ప్రమాదం చోటు చేసుకుందని భావిస్తున్నారు. తమను ఆదుకోవాలని భారత రైతులు కోరారు.

● కోనరావుపేట:మండలంలోని ధర్మారంలో ప్రమాదవశాత్తు వరి కొయ్యలకు నిప్పు అంటుకొని పలువురు రైతులకు చెందిన కరెంటు మోటర్లు, స్టార్టర్లు, కరెంటు


పొలాల్లో చెలరేగుతున్న మంటలు

వైర్లు దగ్ధమయ్యాయి. సుమారు 20 మంది రైతులకు చెందిన పరికరాలు దగ్ధం కావడంతో రెండు లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు బాధిత రైతులు తెలిపారు.

దొంగతనం కేసులో నిందితుడి అరెస్ట్

కొడిమ్యాల, మే 2: మండలంలోని అప్పారావుపేట గ్రామంలో జనవరి 31న రాత్రి రేండ్ల ప్రమీల ఇంటిలో దొంగతనం చేసిన కేసులో నిందితుడైన వరంగల్ అర్బన్ జిల్లాకు చెందిన పాశం పవన్‌ను గురువారం అరెస్ట్ చేసినట్లు కొడిమ్యాల ఎస్సై ఎస్. సందీప్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల మేరకు గురువారం ఉదయం మండలంలోని జేఎన్‌టీయూ పోలీస్ చెక్‌పోస్ట్ వద్ద మల్యాల సీఐ నీలం రవి ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేస్తుండగా ద్విచక్ర వాహనంపై ముగ్గురు వ్యక్తులు వెళ్తుండగా అనుమానించి వారిని పట్టుకున్నారు. ఇద్దరు వ్యక్తులు పారిపోయినట్లు ఎస్సై తెలిపారు. పట్టుబడిన వ్యక్తిని విచారించగా నిందితుడు వివరాలను వెల్లడించినట్లు ఎస్సై తెలిపారు. నిందితున్ని కోర్టులో హాజరు పర్చినట్లు ఎస్సై తెలిపారు. మిగతా నిందితులను పట్టుకుంటామన్నారు.

పనికి తగ్గ వేతనం అందడం లేదని ఉపాధి కూలీల ఆగ్రహం

చందుర్తి, మే 2: పనికి తగ్గ వేతనం రావడం లేదని ఉపాధి హామీ కూలీలు గురువారం సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. చందుర్తి మండల కేంద్రం శివారులో అటవీ ప్రాంతంలోని చీకటిలోయ ప్రాంతంలో మార్చి నుంచి దాదాపు 300 మంది కూలీలు ఉపాధి హామీ పథకంలో భాగంగా కందకాలు తీసే పనులు చేస్తున్నారు. తమకు పనికి తగ్గ వేతనం రాలేదని ఉపాధి హామీ సిబ్బంది దృష్టికి తీసుకువచ్చారు. టెక్నికల్ అసిస్టెంట్ మాట్లాడుతూ పనులు సక్రమంగా చేయడం లేదని పేర్కొనడంతో, కొంత మంది కూలీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. పనులను పరిశీలించకుండానే, ఇష్టానుసారంగా హాజరు వేస్తున్నారన్నారు. టెక్నికల్ అసిస్టెంట్ అవకతవకలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. తమకు మరొక టెక్నికల్ అసిస్టెంట్‌ను కేటాయించాలని ఏపీవోను కోరారు. ఏపీవో రాజయ్య మాట్లాడుతూ వేతనం తక్కువ రాకుండా, కొలతల ప్రకారం పేమెంట్ చేస్తామన్నారు.


ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఉపాధి హామీ కూలీలు

వడదెబ్బతో హమాలీ మృతి


గజ్జెల సంజీవ్ (ఫైల్)

శంకరపట్నం, మే 2: శంకరపట్నం మండలం లింగాపూర్ గ్రామానికి చెందిన హమాలీ వడదెబ్బతో మృతి చెందాడు. హనుమకొండ జిల్లా, భీమదేవరపల్లి మండలం, వంగర గ్రామానికి చెందిన గజ్జెల సంజీవ్ (48) సుమారు 20సంవత్సరాల క్రితం జీవనోపాధి కోసం శంకరపట్నం మండలం లింగాపూర్ తన అత్తగారి ఊరులో హమాలీ పనిచేసుకుంటూ జీవనోపాధి కొనసాగిస్తున్నాడు. రెండ్రోజుల క్రితం వాంతులు, విరోచనాలు కావడంతో హుజూరాబాద్ ఆస్పత్రిలో చికిత్స చేయించుకొని తిరిగి ఇంటికి వెళ్లాడు. 1న రాత్రి ఊపిరి ఆడకపోవడంతో కుటుంబ సభ్యులు హుజూరాబాద్ ఆస్పత్రికి తరలించగా మార్గమధ్యలో మృతి చెందినట్లు తెలిపారు.

రాజ్యాంగంపై కాంగ్రెస్ పార్టీ చిల్లర రాజకీయాలు

సిరిసిల్ల టౌన్, మే 2: బీజేపీ ప్రభుత్వం మూడవ సారి అధికారంలోకి వస్తే రిజర్వేషన్లు మారుస్తుందని కాంగ్రెస్ పార్టీ చిల్లర రాజకీయాలు చేస్తోందని ఎమ్మార్పీఎస్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు బెజ్జంకి అనిల్ అన్నారు. గురువారం సిరిసిల్ల పట్టణం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు చట్టబద్ధత కల్పిస్తామని కాంగ్రెస్ పార్టీ అనేక సార్లు హామీ ఇచ్చి మోసం చేసిందని ఆరోపించారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ, బీఆర్‌ఎస్ పార్టీలను భూస్థాపితం చేయడం మాదిగల లక్ష్యం అన్నారు. ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల్లో మాదిగలకు ఒక్క సీటు కూడా కాంగ్రెస్ పార్టీ కేటాయించలేదని ఆరోపించారు. రిజర్వేషన్లను మొదటి నుంచి బండి సంజయ్ బలపరుస్తూ వస్తున్నాడని అన్నారు. పది సంవత్సరాలు పాటు అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ పార్టీ వర్గీకరణపై ఒక్క చర్యల తీసుకోలేదని వర్గీకరణ కోసం పోరాడిన బిడ్డల్ని కేసీఆర్ జైలులో పెట్టించాడని ఆరోపించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వర్గీకరణపై అంకితభావంతో ఉన్నాడని అన్నారు. బీజేపీ అభ్యర్థి బండి సంజయ్‌కి జాతి మొత్తం అండగా ఉంటుందని అత్యధిక మెజార్టీతో గెలిపిస్తామన్నారు. పార్లమెంట్ ఎన్నికలలో మాదిగలకు ఒక్క సీటు కూడా కేటాయించిన కాంగ్రెస్ వైఖరిని నిరసిస్తూ మే 4న ఛలో హైదరాబాద్‌లో


సమావేశంలో మాట్లాడుతున్న అనిల్

ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించే మాదిగల ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ ఎలగందుల బిక్షపతి, కో కన్వీనర్ పసుల బేష్, జిల్లా, వివిధ మండలాల నాయకులు పాల్గొన్నారు.

కొండగట్టులో ముడుపుల ఆదాయం రూ.1.53లక్షలు

మల్యాల, మే 2: కొండగట్టు అంజనేయస్వామి ఆలయంలో గత నెలలో జరిగిన చిన్న హనుమాన్ జయంతి ఉత్సవాల సందర్భంగా దీక్షాపరులు చెల్లించుకున్న ముడుపులను గురువారం దేవస్థానం అధికారులు లెక్కింపు చేపట్టారు. కొబ్బరికాయలు, బియ్యం, డబ్బులను వేర్వేరు చేసి లెక్కింపు చేయగా రూ.1,53,461 నగదు సమకూరినట్లు ఈవో చంద్రశేఖర్ తెలిపారు. ముడుపుల కొబ్బరికాయలు, బియ్యంను వేలం ద్వారా విక్రయించనున్నట్లు ఈ సందర్భంగా దేవస్థానం అధికారులు తెలిపారు. ఈ లెక్కింపులో ఏఈవో వై.అంజయ్య, పర్యవేక్షకులు సునీల్‌కుమార్, చంద్రశేఖర్‌లతో పాటు రాజేశ్వర్‌రావు, జెమిని శ్రీనివాస్, ఉమామహేశ్వర్, శ్రీలలిత సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో 215మంది మహిళ సేవకులు, ట్రస్ట్ నిర్వహకులు విశ్వనాథుల రమేష్ తదితరులు పాల్గొన్నారు.


ముడుపుల సొమ్ములను లెక్కిస్తున్న ఆలయ అధికారులు

కంప్యూటర్, బ్యూటీషియన్ కోర్సులు ప్రారంభం

గణేశ్‌నగర్,మే 2: రాంనగర్‌లో వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రంలో భాగంగా కంప్యూటర్, బ్యూటీషియన్ కోర్సుల శిక్షణ ప్రారంభం అవుతున్నాయని ఆసక్తి గల యువతీ యువకులు రాంనగర్‌లో గల వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రంలో ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. నైపుణ్య శిక్షణకు అర్హులు ఏడవ తరగతి ఆ పైబడిన తరగతి పాసైన, ఫెయిల్ అయిన 18 సంవత్సరాలు నిండిన విద్యార్థులు, పురుషులు, స్త్రీలు కూడా అర్హులు అని తెలియజేశారు. ఈ శిక్షణ మూడు నెలలు ఉంటుందని తెలిపారు. కోర్సు పూర్తయ్యాక సర్టిఫికెట్ ఇవ్వనున్నారు. కోర్సు ఫీజు వివరాలు కంప్యూటర్ (ఎమ్మెస్ ఆఫీస్, డిటిపి) రూ. 1,000, బ్యూటీషియన్ రూ. 1500, అని జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి బి. శ్రీకాంత్‌రెడ్డి తెలియజేశారు.

రాజన్న హుండీ ఆదాయం రూ.కోటి 52 లక్షలు



హుండీ ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

వేములవాడ, మే 2: వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానం ఖజానాకు హుండీ రూపంలో రూ.కోటి 52 లక్షలకుపైగా ఆదాయం సమకూరింది. 21 రోజుల వ్యవధిలో భక్తులు స్వామివారి హుండీలలో సమర్పించిన నగదు, బంగారు, వెండి కానుకలను గురువారం ఆలయ ఓపెన్ స్లాబ్ ప్రాంగణంలో లెక్కించారు. ఈ సందర్భంగా కోటి, 52 లక్షల, 15 వేల, 575 రూపాయిల నగదు, 218 గ్రాముల బంగారం, 11 కిలోల 500 గ్రాముల వెండి లభించినట్లు ఆలయ ఈవో డి.కృష్ణ ప్రసాద్ తెలిపారు. ఆలయ సిబ్బంది, వాలంటీర్లు హుండీ లెక్కింపులో పాల్గొన్నారు.

వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలి



మాట్లాడుతున్న ఎంపీపీ

ఇల్లంతకుంట, మే 2: వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలని ఎంపీపీ వుట్కూరి వెంకటరమణారెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశానికి కేవలం ముగ్గురు ఎంపీటీసీలు మాత్రమే హాజరవడంతో కోరం లేక సమావేశాన్ని వాయిదా వేసినట్లు తెలిపారు. అనంతరం అధికారులను ఉద్దేశించి ఎంపీపీ మాట్లాడుతూ ఎండల తీవ్రత పెరుగుతున్నందున ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. భూగర్భ జలాలు తగ్గడంతోనే కొన్ని గ్రామాల్లో పంటలు ఎండిపోయాయన్నారు. సమావేశంలో ఎంపీటీసీలు పుష్పలత, ముత్యంరెడ్డి, కోఆప్షన్ సభ్యుడు సలీం, ఎంపీడీవో శ్రీనివాసమూర్తి, తహసీల్దార్ జావెద్ అహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ఎంఈవోకు సన్మానం



ఎంఈవోను సన్మానిస్తున్న అధికారులు

ఇల్లంతకుంట, మే 2: మండలంలో పదోతరగతి పరీక్షల ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించడంపై ఎంఈవో బన్నాజీని మండలపరిషత్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీపీ వుట్కూరి వెంకటరమణారెడ్డి సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ పదోతరగతి ఫలితాల్లో మంచి ఫలితాలు సాధించడానికి కృషిచేసిన ఉపాధ్యాయులకు అభినందనలు తెలిపారు. ఎంపీడీవో శ్రీనివాసమూర్తి, తహసీల్దార్ జావెద అహమ్మద్, ఎంపీటీసీలు తీగల పుష్పలత, ముకుందరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి మాజీ సర్పంచ్

ఇల్లంతకుంట, మే 2:మండలంలోని కందికట్కూర్ మాజీ సర్పంచ్ ముత్యం అమర్‌గౌడ్ గురువారం మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేసి నియోజకవర్గ కార్యాలయానికి వెళ్లారు. ఎంపీపీ వుట్కూరి వెంకటరమణారెడ్డి, మండల అధ్యక్షుడు భూంపెల్లి రాఘవరెడ్డి, నియోజకవర్గ అధికార ప్రతినిధి పసుల వెంకటి, మాజీ ఎంపీపీ గుడిసె అయిలయ్య, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు అంతగిరి వినయ్‌కుమార్, ఎంపీటీసీ దొమ్మాటి కిషోర్‌గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

చక్రధర్‌రెడ్డి నియామకంపై హర్షం

ముస్తాబాద్, మే 2 : ముస్తాబాద్ మాజీ ప్యాక్స్ ఛైర్మన్ కనమేని చక్రధర్‌రెడ్డిని నియోజక వర్గ కో ఇన్‌చార్జి నియామకమవడంపై జడ్పీటీసీ గుండం నర్సయ్య, మాజీ ఏఎంసీ ఛైర్మన్ చిట్నేని అంజనేయరావు, మాజీ ఎంపీపీ కలకొండ కిషన్‌రావు, మాజీ జడ్పీటీసీ సభ్యులు మెర్గు యాదగిరిగౌడ్, నాయకులు ఏనుగు వేణు, సుధాకర్‌రావు, బండి శ్రీకాంత్, ఉపేంద్ర, శీల భాను, తోట ధర్మేందర్, నల్ల చారి హర్షం వ్యక్తం చేశారు. ఎన్నికల నేపథ్యంలో ఏఐసీసీ జనరల్ కార్యదర్శి , తెలంగాణ ఇన్‌చార్జి దీపా దాసు మున్షీ కరీంనగర్ నియోజక వర్గ కో ఇన్‌చార్జిలను నియమించినట్లు తెలిపారు.

బీజేపీ గెలిస్తే రాజ్యాంగం రద్దు

కోనరావుపేట, మే 2: బీజేపీ గెలిస్తే రాజ్యాంగాన్ని రద్దు చేస్తారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. మండలంలోని నిజామాబాద్ గ్రామంలో గురువారం రాత్రి ఎన్నికల ప్రచారాన్ని కొనసాగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి మోదీ ఏటా ఉద్యోగాలను ఇస్తానన్నాడని, ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పని అయిపోయిందన్నారు. నాలుగు నెలల క్రితం బీఆర్‌ఎస్ పార్టీని ప్రజలు పక్కకు పెట్టి కాంగ్రెస్ గెలిపించారన్నారు. ఇప్పుడు పార్లమెంట్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌ను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు కేతిరెడ్డి జగన్మోహన్ రెడ్డి, ఫిరోజ్ పాషా చందనగిరి గోపాల్, ఎంపిటిసి చారి, తాళ్లపల్లి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలకు కట్టుబడి ఉన్నాం

కొడిమ్యాల, మే 2: కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలకు కట్టుబడి ఉందని చొప్పదండి ఎమ్మెల్యే డాక్టరు మేడిపల్లి సత్యం అన్నారు. గురువారం మండలంలోని తురకకాశీనగర్, నమిళికొండ, శ్రీరాములపల్లి, తిప్పయ్యపల్లి, నల్లగొండ గ్రామాల్లో ఎమ్మెల్యే సత్యం పార్టీ నాయకులతో కలిసి కాంగ్రెస్ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావును గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతిఒక్కరికి సంక్షేమ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తుందన్నారు. చొప్పదండి నియోజకవర్గ బిడ్డ రాజేందర్‌రావును ఎంపీగా గెలిపిస్తే అటు కేంద్రంలో, ఇటు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అందించే నిధులతో ఘననీయమైన అభివృద్ధి చేసే అవకాశాలు ఉంటాయన్నారు. అనంతరం పలు గ్రామాలకు చెందిన వివిధ పార్టీ నాయకులకు కాంగ్రెస్ పార్టీ కండువాను కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు మహిపాల్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు నారాయణగౌడ్, ఎంపీపీ స్వర్ణలత పాల్గొన్నారు.

హోం ఓటింగ్‌కు సర్వం సిద్ధం



ఓటు హక్కు వినియోగించుకుంటున్న వృద్ధుడు (ఫైల్)

- వృద్ధులు, దివ్యాంగులకు ప్రత్యేకం
- సిరిసిల్ల, వేములవాడలో ఏర్పాట్లు
- నేటి నుంచి 5వ తేదీ వరకు
- జిల్లాలో 744 మంది ఓటర్లు
- ఓటింగ్ ప్రక్రియకు 19 బృందాలు

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

హోం ఓటింగ్‌కు జిల్లాలో సర్వం సిద్ధం చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో 80 సంవత్సరాలు పైబడిన వృద్ధులు, 40 శాతం వైకల్యం ఉన్న దివ్యాంగులు పోలింగ్ కేంద్రానికి వెళ్లకుండా ఇంటి వద్ద ఓటు హక్కు వినియోగించుకునేందుకు 'హోం ఓటింగ్' సౌకర్యాన్ని కల్పించారు. హోం ఓటింగ్ పద్ధతిని తొలిసారిగా శాసనసభ ఎన్నికల్లో ప్రవేశ పెట్టారు. ఇప్పుడు లోక్‌సభ ఎన్నికల్లోనూ అవకాశం కల్పించారు. ఈ నెల 13న పోలింగ్ ఉన్నా ముందస్తుగా వయోవృద్ధులు, దివ్యాంగుల కోసం ఏర్పాట్లు చేశారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ రెండు నియోజకవర్గాల్లో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అనురాగ్ జయంతి ఏర్పాట్లు చేశారు. శుక్రవారం 3వ తేదీ నుంచి 5 తేదీ వరకు హోం ఓటింగ్ ప్రక్రియ చేపట్ట నున్నారు. ఇందుకు సంబందించిన ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు, మైక్రో అబ్జర్వర్లు, వీడియో గ్రాఫర్, మైక్రో అబ్జర్వర్లకు శిక్షణ ఇచ్చి ఒక బృందంగా ఏర్పాటు చేశారు. వీరు వృద్ధులు, దివ్యాంగులైన ఓటర్ల ఇళ్ల వద్దకు వెళ్తారు. ఇంట్లోనే కంపార్ట్‌మెంట్ ఏర్పాటు చేస్తారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ఓటు హక్కు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను అందించి పోలింగ్ ప్రక్రియ నిర్వహిస్తారు. సిరిసిల్ల, వేములవాడ రెండు సెగ్మెంట్లలో హోం ఓటింగ్ కోసం 744 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. వీరికోసం 19 బృందాలు మూడు రోజులపాటు హోం ఓటింగ్ ప్రక్రియను నిర్వహించనున్నాయి.

పారదర్శకంగా లోక్ సభ ఎన్నికలు

సిరిసిల్ల, మే 2 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల విధులను పారదర్శకంగా నిర్వహించాలని సీనియర్ డిప్యూటీ ఎన్నికల కమిషనర్ నితేష్ వ్యాస్ అన్నారు. గురువారం ఢిల్లీ నుంచి ఎన్నికల నిర్వహణ, సన్నద్ధత పై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్ అనురాగ్ జయంతి కాన్ఫరెన్స్‌కు హాజరయ్యారు. ఈ సందర్భంగా నితేష్ వ్యాస్ మాట్లాడుతూ అందరినీ సమానంగా చూడాలని, ఎవరి పట్ల పక్షపాతంతో వ్యవహరించవద్దన్నారు. ఎన్నికల విధులు భారత ఎన్నికల కమిషన్ నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం పక్కాగా జరగాలని, ఏ చిన్న పొరపాటు రాకుండా అప్రమత్తంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. పోటీలో ఎక్కువ మంది అభ్యర్థులు ఉన్న నియోజకవర్గాలకు అదనపు బ్యాలెట్ యూనిట్లు చేరుకున్నాయని, ఈవీఎం బ్యాలెట్ యూనిట్ల ఎఫ్ఎల్‌సీ, ర్యాండ మైజేషన్ ప్రక్రియ పూర్తి చేయాలని అన్నారు. ఎన్నికల విధులు నిర్వహిస్తున్న ప్రతీ ఒక్కరికి తప్పనిసరిగా పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పించాలని, హోమ్ ఓటింగ్ ప్రక్రియ ను నిబంధనల ప్రకారం మే 8 నాటికి పూర్తి చేయాలని అన్నారు. హోమ్ ఓటింగ్, పోస్టల్ బ్యాలెట్ ఓట్ల వివరాలను పోటీలో ఉన్న అభ్యర్థులకు తెలియజేయాలని సూచించారు. లోక్‌సభ ఎన్నికల కంటే ముందుగానే 100 శాతం ఓటర్ సమాచార స్లిప్పులు ప్రతీ ఒక్క ఓటర్‌కు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. పోలింగ్ దగ్గరవుతున్న సమయంలో డబ్బు, మద్యం పంపిణీ జరగకుండా చూడాలన్నారు. సీ విజిల్ యాప్ వినియోగ పై ప్రచారం చేయాలన్నారు. పోలింగ్ సమయాల్లో కేంద్ర ఎన్ని కల కమిషన్ మార్పులు చేసిందని ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం 6 వరకు పోలింగ్ జరుగు తుందని, ఈ అంశంపై విస్తృత ప్రచారం కల్పించాలని సూచించారు. పోలింగ్‌కు 48 గంటల ముందు ఎన్నికల ప్రచార ప్రక్రియ ఆగిపోతు ందని, సైలెన్స్ పీరియడ్‌లో అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఇబ్బందులను ఎప్పటికప్పుడు అధిగమిస్తూ ప్రశాంత వాతావరణంలో పోలింగ్ నిర్వహించాలన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అఖిల్ మహాజన్, అదనపు కలెక్టర్లు

జిల్లాలో ఓటరు స్లిప్పుల పంపిణీ

జిల్లాలో ఇప్పటి వరకు 3 లక్షల 20 వేల 347 మంది ఓటర్లకు ఓటరు సమాచార స్లిప్పులను పంపిణీ చేశామని హోం ఓటింగ్‌లో 244 మంది పాల్గొన్నారని కలెక్టర్ అనురాగ్ జయంతి వీడియో కాన్ఫరెన్స్‌లో ఎన్నికల కమిషనర్‌కు వివరించారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 277 పోలింగ్ కేంద్రాలలో వెబ్ కాస్టింగ్, 197 పోలింగ్ కేంద్రాల వెలుపల సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునే 2457 సిబ్బంది కోసం వేములవాడ అసెంబ్లీ సెగ్మెంట్‌లో నూతన గ్రంథాలయ భవనం (తహసీల్దార్ కార్యాలయం ప్రాంగణంలో) సిరిసిల్ల అసెంబ్లీ సెగ్మెంట్‌లో జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల గీతానగర్‌లో ఓటర్ ఫెసిలిటేషన్ కేంద్రాలను, పోస్టల్ బ్యాలెట్ స్ట్రాంగ్ రూములను ఏర్పాటు చేశామన్నారు. 744 మంది హోం ఓటింగ్‌లో పాల్గొంటున్నారని, మే 3 నుంచి మే 5 వరకు హోం ఓటింగ్ పూర్తి చేసేందుకు 19 బృందాలను ఏర్పాటు చేశామన్నారు. కాన్ఫరెన్స్‌లో ఎస్పీ అఖిల్ మహాజన్ అదనపు కలెక్టర్లు పూజారి గౌతమి, భీమ్యా నాయక్, వేములవాడ ఆర్డీవో రాజేశ్వర్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

బ్యాంకులకు రాణిరుద్రమ రూ.16 కోట్ల ఎగనామం



మాట్లాడుతున్న వనిత, స్వరూప తిరుపతిరెడ్డి

సిరిసిల్ల టౌన్, మే 2: సిరిసిల్ల అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా పోటి చేసిన రాణిరుద్రమ రూ.16 కోట్లు బ్యాంక్‌లకు ఎగనామం పెట్టి వచ్చి సిరిసిల్లకు వచ్చారని కాంగ్రెస్ మహిళా జిల్లా అధ్యక్షురాలు కాముని వనిత అన్నారు. గురువారం సిరిసిల్ల ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఎవరి వద్ద ఎన్ని కోట్లు వసూలు చేశారో? తమ వద్ద రుజువులు ఉన్నా యన్నారు. రాణిరుద్రమ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను విమర్శిస్తే ఊరు కోబోమన్నారు. పొన్నం ప్రభాకర్‌కు కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలోని అసెంబ్లీ స్థానాల్లో ఎక్కడి నుంచైన పోటీచేసే అర్హత ఉందని, కరీంనగర్ నుంచి పారిపోయి హుస్నాబాద్‌లో పోటీ చేయలేదన్న విషయం తెలుసుకోవాలన్నారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల సమయంలో సిరిసిల్లకు వచ్చి పోటీ చేసిన రాణిరుద్రమ అంటే అంతకుముందు ఇక్కడి ప్రజలకు తెలుసా అన్నారు. కాంగ్రెస్ సిరిసిల్ల పట్టణ అధ్యక్షురాలు స్వరూపతిరుపతిరెడ్డి మాట్లాడుతూ ఎవరితో లాలూచి పడి సిరిసిల్లకు వచ్చి పోటీ చేశారో రాణిరుద్రమ చెప్పాలన్నారు. ప్రజలు కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావును గెలిపిస్తున్నారన్నారు. కాంగ్రెస్ మహిళ పట్టణ ప్రధాన కార్యదర్శి అరుణ, ఉపాధ్యక్షురాలు రోజా, వార్డు అధ్యక్షురాలు జయలక్ష్మి పాల్గొన్నారు.

సోషల్ మీడియా జిల్లా కో ఆర్డినేటర్‌పై చర్యలు తీసుకోవాలి



వినతి పత్రం అందజేస్తున్న కాంగ్రెస్‌కు చెందిన నాయకులు

తంగళ్లపల్లి, మే 2: సీనియర్ నాయకులపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ అగౌరవ పరుస్తున్న కాంగ్రెస్ సోషల్ మీడియా జిల్లా కో ఆర్డినేటర్ గడ్డం మధుకర్(చోటు)పై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జల్గం ప్రవీణ్, పార్టీ నాయకులు కోరారు. గురువారం జిల్లా అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు ఆయన నివాసంలో వినతి పత్రం అందజేశారు. సోషల్ మీడియా కో ఆర్డినేటర్ చేస్తున్న పార్టీ వ్యతిరేక చర్యలను వివరించారు. సోషల్ మీడియా కో ఆర్డినేటర్‌పై చర్యలు తీసుకుంటామని ఆది శ్రీనివాస్ సానుకూలంగా స్పందించారని మండల నాయకులు తెలిపారు. నాయకులు వైద్య శివ ప్రసాద్, పుర్మాణి లింగారెడ్డి, భైరినేని రాము, మోర రాజు, లింగాల భూపతి, మునిగెల రాజు, నేరెల్ల నర్సింగం, గుగ్గిళ్ల శ్రీకాంత్, కొత్త రాజశేఖర్, పొన్నం పర్శరాములు, నాయకులు ఉన్నారు.

నాయకుడిపై భౌతిక దాడి

తంగళ్లపల్లి మండల కేంద్రంలో కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశం మండల అధ్యక్షుడు జల్గం ప్రవీణ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. రెండు రోజుల క్రితం మంత్రి పొన్నం ప్రభాకర్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన ఇందిరమ్మకాలనీకి చెందిన మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ భైరి రమేశ్ సమావేశానికి హాజరయ్యారు. దీంతో ఇందిరమ్మకాలనీకి చెందిన ఆ పార్టీ జిల్లా సోషల్ మీడియా కో ఆర్డినేటర్ గడ్డం చోటు ఆగ్రహం వ్యక్తం చేశాడు. పరుష పద జాలంతో రమేశ్‌పై భౌతిక దాడికి దిగాడు. సీనియర్ నాయకులు అడ్డుకునే ప్రయత్నం చేస్తే వారిపై అనుచిత వ్యాఖ్యలు చేశాడని, గతంలో సైతం దురుసుగా వ్యవహరించడంతోపాటు భౌతిక దాడికి దిగాడని, క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని నాయకులు ఫిర్యాదు చేశారు.

నిర్వాసితులను పట్టించుకోని బీఆర్‌ఎస్

వేములవాడ టౌన్, మే 2 : పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ ఏనాడూ నిర్వాసితులను పట్టించుకోలేదని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ మండలం రుద్రవరం, సంకెపల్లిలో గురువారం పార్లమెంట్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావుకు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు నెలల క్రితం బీఆర్‌ఎస్‌ను పక్కనబెట్టినట్లుగా బీజేపీని కూడా పక్కనబెట్టాలన్నారు. ముంపు గ్రామాల సమస్యలపై పీసీసీ అధ్యక్ష హోదాలో సీఎం రేవంత్‌రెడ్డి సంకెపల్లిలో బస చేసిన విషయం తెలిసిందేనని నిర్వాసితులకు సూచించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పిల్లి కనుకయ్య జిల్లా నాయకుడు చింతపల్లి శ్రీనివాస్‌రావు నాయకులు కత్తి కనుకయ్య, గాలిపెల్లి సువర్ణస్వామి, ఊరడి రాంరెడ్డి, వంకాయల భూమయ్య, రగుడు పర్శరాములు, తాడెం శ్రీనివాస్, మారవేని రాజ్‌కుమార్, ఇటీక్యాల లింగయ్య తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాల సంక్షేమం

ఎల్లారెడ్డిపేట: కాంగ్రెస్ గెలుపుతోనే అన్ని వర్గాల సంక్షేమం సాధ్యమని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సయ్య అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతోపాటు బొప్పాపూర్, గొల్లపల్లి, బండలింగంపల్లి, తిమ్మాపూర్, వెంకటాపూర్, అల్మాస్‌పూర్, అక్కపల్లి, దుమాల, రాజన్నపేట తదితర గ్రామాల్లో స్థానిక నాయకులతో కలిసి గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ ఎన్నికల్లో బీఆర్‌ఎస్, బీజేపీకి ఓటుతో బుద్ధి చెప్పాలని కోరారు. పార్లమెంట్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా వెలిచాల రాజేందర్‌రావును గెలిపించాలన్నారు. నాయకులు లక్ష్మారెడ్డి, బాల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, బుచ్చాగౌడ్, గిరిధర్‌రెడ్డి, లింగాగౌడ్, గౌస్, దేవయ్య, రాములు, రాజేందర్, రాజునాయక్, రమేశ్, బాబు, రాజుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రుద్రంగి: కరీంనగర్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావును గెలిపించాలని రుద్రంగి మండల కేంద్రంలో గురువారం కాంగ్రెస్ నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. నాయకులు తర్రె మనోహర్, ఎర్రం గంగనర్సయ్య, గడ్డం శ్రీనివాస్ రెడ్డి, చెలుకల తిరుపతి, ఇప్ప మహేష్, అభిలాష్, గండి నారాయణ, పిడుగు లచ్చిరెడ్డి, తర్రె లింగం, దర్న మల్లేశం, సూర యాదయ్య, ఎర్రం రాజలింగం, పూదరి మహిపాల్, ఇప్ప నరేష్ పాల్గొన్నారు.

మహిళల రక్షణ కోసమే షీటీంలు

సిరిసిల్ల క్రైం, మే 2: మహిళలు, బాలికల రక్షణ కోసం షీటీంలను ఏర్పాటు చేశామని, మఫ్టీలో నిఘా ఉంచామని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. జిల్లాలో గత నెల రోజులుగా షీటీమ్ బృందాలు అవగాహన సదస్సులు నిర్వహించిన సందర్భంగా ఆయన గురువారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ నెలలో షీటీమ్‌కు వచ్చిన ఫిర్యాదులపై ఏడు కేసులు నమోదు చేశామని, ఇందులో 4ఎఫ్ఐఆర్‌లు, 3 పెట్టికేసులు పెట్టామన్నారు. విద్యార్థినులు, మహిళలు అన్యాయానికి గురైనపుడు ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేయాలని, నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. మహిళలు, యువతులు ఎలాంటి సమస్య ఉన్నా షీటీమ్ నంబరు 8712656425ను లేదా డయల్ 100ను సంప్రదించాలన్నారు.

వాలీబాల్ శిక్షణ శిబిరం ప్రారంభం

ఎల్లారెడ్డిపేట, మే 2: తెలంగాణ ప్రభుత్వం, రాజన్నసిరిసిల్ల జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్‌లో నిర్వహించ తలపెట్టిన ఉచిత వాలీబాల్ శిక్షణ శిబిరాన్ని గురువారం ప్రారంభించారు. జూన్ 2 వరకు కొనసాగుతోందని పీఈటీ ప్రభాకర్ పేర్కొన్నారు. ప్రతీరోజు ఉదయం 6 గంటల నుంచి 8.30, సాయంత్రం 4.30 నుంచి 6.30 గంటల వరకు ఉంటుందని తెలిపారు.

పార్లమెంట్ కో ఇన్‌చార్జిలుగా జిల్లా నాయకులు

సిరిసిల్ల, మే 2 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ పార్లమెంట్ ఎన్నికల కో ఇన్‌చార్జి లను నియమిస్తూ ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి తెలంగాణ ఇన్‌చార్జి దీపదాస్ మున్షీ ఉత్తర్వులు ఇచ్చారు. అందులో రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన కాంగ్రెస్ నాయకులను కో ఇన్‌చార్జిలుగా నియమించారు. మాజీ ఎమ్మెల్యే కటకం మృత్యుంజయం, డీసీసీ మాజీ అధ్యక్షుడు నాగుల సత్యనారాయణగౌడ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు కొండూరు గాంధీరావు, సింగిల్ విండ్ మాజీ ఛైర్మన్ కనమేని చక్రధర్‌రెడ్డిని నియమించారు. వారి నియామకంపై జిల్లా కాంగ్రెస్ నాయకులు అభినందనలు తెలిపారు.

మోదీ సభను విజయవంతం చేయాలి

ముస్తాబాద్, మే 2: ఈ నెల 8వ తేదీన వేములవాడలో నిర్వహించ తలపెట్టిన బీజేపీ బహిరంగ సభను విజయ వంతం చేయాలని ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి రెడ్డబోయిన గోపి అన్నారు. ముస్తాబాద్ మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో బహిరంగ సభకు నరేంద్ర మోదీ రానున్నట్లు తెలిపారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వెంకటేశ్వర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు అంజాగౌడ్ పాల్గొన్నారు.

గంభీరావుపేట: ప్రధాని బహిరంగ సభను విజయ వంతం చేయాలని గంభీరావుపేట మండల కో ఆర్డినేటర్ కోమల మహేష్ పిలుపు నిచ్చారు. మండల కేంద్రంలో బీజేపీ కార్యకర్తల సమావేశాన్ని గురువారం నిర్వహించారు.

పెద్దమ్మ పెద్దిరాజుల కల్యాణోత్సవం

ముస్తాబాద్, మే 2: మండలంలోని ఆవునూర్‌లో ముదిరాజ్ సామాజికవర్గం ఆధ్వర్యంలో పెద్దమ్మ, పెద్దిరాజుల కల్యాణ మహోత్సవాన్ని గురువారం కన్నుల పండువగా నిర్వహించారు. వేడుకల్లో ఎంపీపీ శరత్‌రావు, జడ్పీటీసీ గుండం నర్సయ్య, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, రవి, సభ్యులు పాల్గొన్నారు.

ఆర్చరీ శిక్షణ శిబిరం ప్రారంభం

కోనరావుపేట, మే 2 : కోనరావుపేట మండలం నాగారంలో విద్యార్థులకు ఉచిత వేసవి ఆర్చరీ శిక్షణ శిబిరాన్ని గురువారం ప్రారంభించారు. జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో నాగారం ప్రభుత్వ పాఠశాలలో శిబిరాన్ని ఏర్పాటు చేశారు. శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆర్చరీ కోచ్ హరీష్, నాగభూషణం, నాగరాజు ఉన్నారు.

రిజర్వేషన్ల తొలగింపు ప్రచారాన్ని నమ్మవద్దు



సిరిసిల్లలో మాట్లాడుతున్న గోపీ

సిరిసిల్ల రూరల్, మే 2: కేంద్రంలో తిరిగి బీజేపీ అధికారంలోకి వస్తే రాజ్యాంగంతోపాటు రిజర్వేషన్‌లను తొలగిస్తుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రచారం చేయడం విడ్డూరంగా ఉందని, దీనిని ప్రజలు నమ్మవద్దని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డబోయిన గోపీ అన్నారు. సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్, బీజేపీ ఒకటేనని ప్రచారం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ నాయకులు ఇప్పుడు పార్లమెంట్ ఎన్నికల్లో ఏ రకంగానైనా అధికారంలోకి రావాలని బీజేపీ అధికారంలోకి వస్తే రిజర్వేషన్‌లను తొలగిస్తుందనే అంశాన్ని తెరపైకి తీసుకొచ్చారని, ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని అన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీ రిజర్వేషన్‌లతో పాటు ఓబీసీలో వెనుకబడిన తరగతులవారికి కూడా బీజేపీ రిజర్వేషన్‌లను కల్పించందనే విషయాన్ని మంత్రి పొన్నం గుర్తు చేసుకోవాలన్నారు. అధికారంలో ప్రజా ప్రతినిధిగా ఏది పడితే అది మాట్లాడి చులకన కావద్దని సూచించారు. జిల్లాల తగ్గింపు చేస్తారని ప్రచారం జరుగుతోందని,సిరిసిల్లలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన నేపథ్యంలో సిరిసిల్ల జిల్లా ఉంటుందా లేదా అనేది కార్లిటీ ఇవ్వాలని అన్నారు. ఈ నెల 8వ తేదీన ప్రధాని మోదీ సభకు ప్రజలు స్వచ్ఛందంగా తరలిరావాలన్నారు. నాయకులు దుమాల శ్రీకాంత్, వడ్నాల శేఖర్, పల్లి కొండ నర్సయ్య, దేవుల పల్లి శ్రీనివాస్, పల్లిరాజు, చొక్కి శ్రీనివాస్, వెలిచాల అభి, లింగంపల్లి రాము, వేముల ప్రవీణ్, బూర సందీప్, చక్కని మహేష్, వేముల నితిన్, గాజుల అనిల్, సామల సాయి, బిట్ల జాఫర్, బూట్ల సాగర్, నాగం కిషన్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ పాలనలోనే గ్రామాల అభివృద్ధి



కోనరావుపేటలో ప్రచారం చేస్తున్న నాయకులు

కోనరావుపేట, మే 2 : బీఆర్‌ఎస్ ప్రభుత్వ పాలనలోనే గ్రామాలు అభివృద్ధి చెందాయని జడ్పీ ఛైర్ పర్సన్ అరుణ రాఘవరెడ్డి, వేములవాడ నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు అన్నారు. కోనరావుపేట మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో కరీంనగర్ పార్లమెంట్ అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్‌ను గెలిపించాలని కోరుతూ గురువారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని చూసి వినోద్ కుమార్‌ను గెలిపించాలని కోరారు. సెస్ వైస్ ఛైర్మన్ తిరుపతి, పాక్స్ ఛైర్మన్ నర్సయ్యఎంపీపీ చంద్రయ్య గౌడ్, మల్యాల దేవయ్య పాల్గొన్నారు.

వేములవాడ టౌన్: వేములవాడ మండలం మారుపాకలో ఎంపీపీ బూర వజ్రవ్వబాబు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్నారు. బీజేపీ, కాంగ్రెస్‌పై ప్రజలు విసుగెత్తి ఉన్నారని బీఆర్‌ఎస్ అభ్యర్థికి ఓటు వేసేందుకు చూస్తున్నారని అన్నారు. గోనే సత్తయ్య, తుమ్మల రవి, బూర ప్రభాకర్, శ్రీనివాస్, కొండస్వామి తదితరులు ఉన్నారు.

ముస్తాబాద్: ముస్తాబాద్ మండల కేంద్రంతోపాటు గ్రామాల్లో బీఆర్‌ఎస్ నాయకులు గురువారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఎంపీపీ శరత్‌రావు, మండల, పట్టణ అధ్యక్షుడు సురేందర్‌రావు, నర్సింహారెడ్డి,మండల మాజీ అధ్యక్షుడు గోపాల్‌రావు, మాజీ ఏఎంసీ ఛైర్మన్‌లు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: బీఆర్‌ఎస్ హయంలోనే రాష్ట్రంలో అభివృద్ధి జరిగిందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య అన్నారు. మండల కేంద్రంతోపాటు గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి వినోద్‌ను గెలిపించాలని ఆగయ్య కోరారు. జడ్పీటీసీ లక్ష్మణ్‌రావు, ఎంపీపీ రేణుక పాల్గొన్నారు.

గంభీరావుపేట: గంభీరావుపేట మండల కేంద్రంతో పాటు నర్మాల, కోళ్ళమద్ది గ్రామాల్లో నాఫ్స్‌కాబ్ ఛైర్మన్ కొండూరు రవీందర్‌రావు, సిరిసిల్ల నియోజక వర్గం బీఆర్‌ఎస్ ఎన్నికల ఇన్‌చార్జి తుల ఉమ గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వినోద్‌కుమార్‌కు ఓటు వేయాలన్నారు.

వీర్నపల్లి : వినోద్ కుమార్‌ను గెలిపించాలని జడ్పీ కోఆప్షన్ సభ్యుడు చాంద్ పాషా, నాయకులు మండలంలో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

చందుర్తి : బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి వినోద్ కుమార్‌ను గెలిపించాలని కోరుతూ పార్టీ నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. మాజీ ఎంపీపీ చిలుక పెంటయ్య, నాయకులు పాల్గొన్నారు.

రుద్రంగి: కరీంనగర్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్‌ను కారు గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని రుద్రంగి మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ నాయకుల ఇంటింటా ప్రచారాన్ని గురువారం నిర్వహించారు. ఎంపీపీ స్వరూపరాణి మహేష్, సెస్ డైరెక్టర్ గంగారాం పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ విజయాలను ఇంటింటా వివరించాలి



ఓటు అభ్యర్థిస్తున్న నాయకులు

ఇల్లంతకుంట, మే 2: కేంద్ర ప్రభుత్వం సాధించిన విజయాలను బీజేపీ కార్యకర్తలు ఇంటింటికీ తీసుకెళ్లాలని కర్ణాటక బీజేవైఎం ప్రధాన కార్యదర్శి మారుతి అన్నారు. కరీంనగర్ ఎంపీగా బండి సంజయ్‌కుమార్ గెలవాలని గురువారం జంగమరెడ్డిపల్లె రామలింగేశ్వరస్వామి ఆలయంలో మండల అధ్యక్షుడు కొత్త శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో దేశం అన్నిరంగాల్లో అగ్రగామిగా నిలిచిందన్నారు. మత ప్రాతిపదికన ఇచ్చే రిజర్వేషన్లకు బీజేపీ వ్యతిరేకమన్నారు. భారత రాజ్యాంగాన్ని ప్రతీ ఒక్కరం గౌరవిస్తామన్నారు. కొంతమంది నాయకులు ఓట్ల కోసం తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. బండి సంజయ్ విజయం ఖరారైందని, సామాన్యులు బీజేపీ వెంట నడువడానికి సిద్ధం అయ్యారని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీజేపీ కార్యదర్శి జయశ్రీ, మండల అధ్యక్షుడు కొత్త శ్రీనివాస్‌రెడ్డి, ఇన్‌చార్జి సాయిని మల్లేశం, మాజీ సర్పంచుల ఫోరం అధ్యక్షుడు చల్ల నారాయణ, నాయకులు చింతలపల్లి తిరుపతిరెడ్డి, స్వామి, శ్రావణ్, మధుసూదన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, అనీల్, కృష్ణ, సంతోష్, అశోక్‌యాదవ్, మ్యాకల మల్లేశం, ముత్తవ్వ, సాగర్, సతీష్, రవీందర్, రాజు, మల్లారెడ్డి, సంతోష్ పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మండలం రాజన్నపేట, అల్మాస్‌పూర్ గ్రామాల్లో బీజేపీ మండల అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, మండల ఇన్‌చార్జి రాజిరెడ్డి ఆధ్వర్యంలోని నాయకులు కరీంనగర్ బీజేపీ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్‌కు మద్దతుగా గురువారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. నాయకులు బుగ్గారెడ్డి, యాదగిరి, ప్రశాంత్, ఆంజనేయులు పాల్గొన్నారు.

గంభీరావుపేట : గంభీరావుపేట మండలం దమ్మన్నపేటలో బీజేపీ నాయకులు గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీజేపీ మండల అధ్యక్షుడు గంట అశోక్. జిల్లా అధికార ప్రతినిధులు ప్రసాద్‌రెడ్డి, దేవసాని కృష్ణ, నాయకులు సత్యనారాయణ, నాగరాజు, రాజు, రమేష్ తదితరులు ఉన్నారు.

కోనరావుపేట: బండి సంజయ్‌ని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని బీజేవైఎం జిల్లా నాయకుడు బెండ్రే శ్రీనివాస్ కోరారు. కోనరావుపేట మండలం కనగర్తిలో ఇంటింటా ప్రచారాన్ని కొనసాగించారు. బీజేపీ మండల అధ్యక్షుడు రామచంద్రం, జిల్లా నాయకుడ సురేందర్ రావు, బాలాజీ తదితరులు ఉన్నారు.

రుద్రంగి: ఈ నెల 8న వేములవాడలో నిర్వహించే ప్రధానమంత్రి నరేంద్ర మోడీ బహిరంగ సభను విజయవంతం చేయాలని బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు నంద్యాడపు వెంకటేష్ అన్నారు. రుద్రంగి మండల కేంద్రంలో బండి సంజయ్‌కు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. బీజేపీ మండల అధ్యక్షుడు అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.